క్లుప్తంగా

నరసింహయ్యకు నివాళి



నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం సీనియర్ నాయకులు టి.నరసింహయ్య వర్ధంతిని పురస్కరించుకుని ముజఫర్ నగర్‌లో ఆయన చిత్ర పటానికి పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నరసింహయ్య సేవలను పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ వివరించారు. అలాగే ఈ నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయాలకు వాడుకుంటుండటం తగదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, సీహెచ్ సాయిబాబా, ధనలక్ష్మి, ఓబులమ్మ, దానమ్మ పాల్గొన్నారు.

గ్రూప్-1 అధికారిపై దాడి

• కేసు నమోదు

కర్నూలు: కర్నూలు సంక్షేమ భవన్‌లో శిక్షణ పొందుతున్న గ్రూప్-1 అధికారి భరత్ కుమార్ రెడ్డిపై దాడి జరిగింది. బుధవారం సాయంత్రం కొత్తకోటలో బస్సు ఎక్కి సీటులో కూర్చొని కర్నూలుకు వస్తూ ల్యాప్‌టాప్ చూసుకుంటుండగా ఆయన ముందు సీటులో కూర్చున్న పవన్ అనే వ్యక్తి సడన్‌గా తన కుర్చీని వెనక్కు జరుపుకోవడంతో భరత్‌కుమార్ రెడ్డి చేతిలోని ల్యాప్‌టాప్ కింద పడి పగిలిపోయింది. ఈ సందర్భంగా వారి మధ్య గొడవ జరిగింది. కర్నూలు కొత్తబస్టాండ్‌లో బస్సు దిగిన తర్వాత పవన్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి భరత్‌కుమార్ రెడ్డిపై దాడి చేశారు. దీంతో ఆయన నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులకు తైక్వాండో కిట్ల పంపిణీ



తైక్వాండో కిట్లు పంపిణీ చేస్తున్న సీనియర్ వైద్యుడు శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): స్థానిక పెద్దమార్కెట్ కింగ్ పార్కు మైదానంలో గురువారం తైక్వాండో క్రీడాకారులకు తైక్వాండో కిట్లను సీనియర్ వైద్యులు శంకర్ శర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు క్రీడల వట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్య వంతులుగా, చురుగ్గా ఉంటారన్నారు. తనవంతుగా క్రీడాకారులకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దు



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించాలనే ఆలోచనను విరమించుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులపై కరెంట్ భారాన్ని మోపేందుకు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించేందుకు సిద్ధమైందన్నారు. ఈవిషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రహించకుండా రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. భవిష్యత్‌లో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడ్, నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందనలు

కర్నూలు (టౌన్): ఈనెల 12 నుంచి 14 వరకు తెలంగాణ రాష్ట్రంలోని జనగాంలో నిర్వహించిన జాతీయ సీనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన క్రీడాకారులు రవి, కళ్యాణిలను గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

22న ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: ఈనెల 22న అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ గురువారం తెలిపారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వీక్షించేందుకు ఆలయంలో ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేయనున్నామన్నారు.

• అవోపా ఆధ్వర్యంలో జిల్లా గోరక్షణ శాలలో ఈనెల 19, 20 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కాషాయ జెండాలను ఉచితంగా అందించనున్నట్లు అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి హిందూ బంధువు కాషాయ జెండా ఇంటిపై ఆవిష్కరించుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

• పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా సిల్వర్‌జూబ్లీ కళాశాల మీటింగ్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని ప్రసంగించారు. విజయవాడలో సుమారు రూ.400 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 19న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించేలా రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి గొప్ప వ్యక్తులను ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లోకల్ బాడీ ఎన్నికలు, నామినేటెడ్ పదువుల్లో మహిళలకు 50 శాతానికి పైగా రిజర్వేషన్ కల్పించారన్నారు. డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా 10 రోజుల నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర విశేషాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆహుతులను ఆకర్షించిందన్నారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ విజయ జ్యోతి, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్. కుమార్, డిప్యూటీ ఈఓ హనుమంతరావు పాల్గొన్నారు.

కుల గణనకు ప్రజలు సహకరించాలి

• సీపీఓ హిమ ప్రభాకర రాజు



హిమ ప్రభాకర రాజు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనకు ప్రజలు సహకరించాలని సీపీఓ హిమ ప్రభాకరరాజు కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణన సర్వే ఆధారంగా సంక్షేమపథకాల అమలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ వంటివి ఏమీ ఉండవన్నారు. వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుసుకోవడం కోసమే ఈనెల 19 నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణనను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈనెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని, సర్వేకు అధికారులు వచ్చిన సమయంలో అందుబాటులో లేని వారి వివరాలను జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సేకరించనున్నట్లు చెప్పారు. కుల గణనకు జిల్లాలో 10,395 మంది ఎన్యుమరేటర్లు, 2,757 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని నంద్యాల రోడ్డులో ఉన్న మారుతీ మెగా సిటీలో నివాసముంటున్న సుష్మ (34) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త అజయ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా సుష్మ నరాల జబ్బుతో బాధ పడుతుండేది. బుధవారం రాత్రి నరాల ఒత్తిడి తీవ్రం కావడంతో తట్టుకోలేక గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె తల్లి ఉషా రాణి కరివెన సత్రంలో పనిచేస్తోంది. అనారోగ్య కారణాలతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



టెంకాయ కొట్టి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్‌లో మెప్మా, టీఎల్ఎఫ్ (టౌన్ లెవల్ ఫెడరేషన్) వారి సహకారంతో 'పట్టణ ప్రగతి యూనిట్' కార్యక్రమంలో భాగంగా పేపర్ ప్లేట్ తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని పొదుపు మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ శివలీల, కార్పొరేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



38వ రోజు ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్‌వాడీలు 38 సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ జీతాలు పెంచకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి సహకారం

• రిజర్వాయర్లలో 25 లక్షలకు పైగా చేప పిల్లలను విడుదల చేశాం
• అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో మంచి, ఉప్పునీటి చేపలు
• డీఆర్వో మధుసూదన్ రావు



నదిలోకి చేప పిల్లలను వదులుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): మత్స్య పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గొందిపర్ల గ్రామం ఎదురుగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం పరిధిలో తుంగభద్ర నదిలో 6.75 లక్షల చేప పిల్లలను ఆయన జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామలతో కలిసి 80-100 మి.మీ సైజు మూడు రకాల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని సుంకేసుల రిజర్వాయర్, తుంగభద్ర నదులలో 25 లక్షల చేప పిల్లలను వదిలినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఫిష్ ఆంధ్రా ద్వారా మంచి నీటి చేపలు, ఉప్పు నీటి చేపలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఉన్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కేవీకే సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె రూరల్ : వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులకు మూడు నెలల గ్రామీణ వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాశాల సాంకేతిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రికల్చర్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయం పై అవగాన పెంచుకోని ఇప్పటి వ్యవసాయ స్థితిగతులకు అనుగుణంగా భవిష్యత్తులో పరిశోధనలు చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూ సారా ఆధారిత ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు, పశుపోషణ, ఉద్యావన పంటల సాగు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లక్ష్మీప్రియ, రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



నాగలదిన్నె వంతెన వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: వాహనదారులు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వంతెన వద్ద నిర్మిస్తున్న పోలీసు చెక్‌పోస్టును డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వంతెన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బ్రిడ్జిపై అసాంఘిక కార్యలాపాలు, వాహనాలలో అక్రమ రవాణాకు పాల్పడితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలని సూచించారు. కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రేపు యోగి నరసింహస్వామి రథోత్సవం



యోగి నరసింహస్వామి

పత్తికొండ రూరల్: పత్తికొండ-హోసూరు గ్రామాల మధ్య నరసింహస్వామి తోటలో కొలువుదీరిన మహాత్మాయోగి నరసింహస్వామి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా నిర్వహించే ఈ రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. 19న ఆరాధన సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, రథాంగహోమం, రథోత్సవ కలశస్థాపన, తీర్థప్రసాద వినియోగం, రాత్రి భజన ఉంటుంది. 20న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

21న మహాదేవప్ప తాత ఆరాధన

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన మహాదేవప్ప తాత 36వ ఆరాధనోత్సవాలు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆరోజు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, గణపతి పూజ, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం, భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణానికి చెందిన టీవీఎస్ మినరల్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచి రూ.10,016 నగదు బహుమతి, ట్రోఫీ గెలుచుకుంది. 33 జట్లు తలపడిన ఈ టోర్నీలో గురువారం ఫైనల్‌లో వెల్దుర్తి గట్టి ఎలెవెన్, వెల్దుర్తి యశ్వంత్ ఎలెవెన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యశ్వంత్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 34 పరుగులకు ఆలౌట్ కాగా ప్రత్యర్థి జట్టు వికెట్ నష్టపోకుండా టార్గెట్ చేధించి విజేతగా నిలిచింది. విజేతలకు, రన్నర్స్‌కు (రూ.5,016) నగదు బహుమతులను దాత టీవీఎస్ శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్ నాయుడు, చక్రపాణిరెడ్డి, ట్రోఫీలను దాత, నిర్వాహకుడు వెంకటప్పనాయుడు అందించారు. నిర్వాహకులు బోయపాటి వెంకి, మధు, చందు, మహేశ్, హరి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా పార్టీ నాయకుడు మార్నేళ్ల విజయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు జోహరాపురంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దాసు, నాగరాజు పాల్గొన్నారు.

రాహుల్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు

కర్నూలు సిటీ: దేశ వ్యాప్తంగా ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మాసమసీదు ప్రాంతంలో ఇంటింటికి ఇందిరమ్మ రాజ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ కోడుమూరు ఇన్‌చార్జ్ దామోదరం రాధాకృష్ణ, ఎన్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు బతుకన్న, కిసాన్ సెల్ అధ్యక్షుడు పోతుల శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాజరస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్ : కల్లూరుకు చెందిన వడ్డె మధుశేఖర్(56) అప్పుల బాధ తాళలేక గురువారం పెద్దపాడు సమీపంలో ఉరి వేసకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరులో నివాసం ఉంటున్న మధుశేఖర్‌కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం బయటి వ్యక్తుల వద్ద చేసిన అప్పులు పెరిగిపోవడం, తీర్చే పరిస్థితి కనిపించకపోవడంతో పెద్దపాడు సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన కొందరు రైతులు గుర్తించి కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సోమ్లానాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మధుశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో గురువారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. సారా తాయారు చేసే స్థావరాలను గుర్తించి అక్కడ బిందెల్లో నిల్వ ఉంచిన 1,500 లీటర్ల బెల్లం ఊట, ఐదు లీటర్ల సారాతో పాటు బిందెలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ గుడికల్ గ్రామానికి చెందిన ఉలిగయ్య, నారాయణ కుటుంబ సభ్యులు రూ.1,01,120 దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలను, పూలమాల, శేషవస్త్రం, బాండు అందజేశారు. ఆలయ ముఖ్య అర్చకుడు నాగరాజ్‌స్వామి పాల్గొన్నారు.

మూర్వకొండ ఘాట్ వద్ద పోలీస్ బందోబస్తు



అర్లపాడు ఘాట్ వద్ద వీఆర్వో వెంకటస్వామికి సూచనలిస్తున్న ఎస్ఐ జయశేఖర్

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపాన ఉన్న మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల వద్ద గురువారం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటం గ్రామంలో జరిగే లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకల సందర్భంగా కృష్ణానది మీదుగా ఇంజిన్ బోట్లలో ప్రయాణికులను తరలించకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌లను స్వయంగా పరిశీలించి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇంజిన్ బోటు నిర్వాహకులు నదిలో బోటు తిప్పరాదని, పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నది పరివాహకం వెంట ఇంజిన్ బోట్లు తిప్పడంపై ప్రభుత్వం నిషేధం విధించిన సంగతిని విస్మరించరాదని పేర్కొన్నారు. సింగోటం జాతరకు వెళ్లే భక్తులు రోడ్డు మార్గం గుండా వెళ్లాలని గ్రామాల్లో దండోరా వేయించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు

కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమ మద్యంతో పాటు సీజ్ చేసిన ఆటోను చూపుతున్న ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: మండలంలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. టోల్‌గేట్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆదోనికి చెందిన బోయ రాధమ్మ, ఈరమ్మ, జంగం శివకుమార్ ఆటోలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితుల నుంచి కర్ణాటక మద్యం 768 జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్/తుగ్గలి/నందవరం: నియోజవర్గంలోని వ్యవసాయ కనెక్షన్లకు శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రాఘవేంద్ర గురువారం పేర్కొన్నారు. కర్నూలులోని 220 కేవీ విద్యుత్ మెయిన్ లైన్ మరమ్మతుల దృష్ట్యా అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, అలాగే సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. అలాగే తుగ్గలి, నందవరం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు తెలిపారు.

29న ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐసీఎంఆర్, హెచ్‌బీసీఆర్ ప్రాజెక్టు క్యాన్సర్ వైద్య విభాగంలో తాత్కాలికంగా పనిచేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఉదయం 10 గంటలకు కళాశాలలోని కౌన్సిల్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.